క్లుప్తంగా

బంగారు పతకాలు సాధించడం హర్షణీయం



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న తాలూకా సీఐ శ్రీరామ్

కర్నూలు (టౌన్) : గత నెల 26, 27 తేదీల్లో బెంగళూరులో నిర్వహించిన వెస్ట్రన్ కప్ మొదటి జాతీయ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ చాటారు. కర్నూలు నగరానికి చెందిన తైక్వాండో క్రీడాకారులు క్యూరొగ్, పూమ్‌సే, డెమో పోటీల్లో సుగంధిని, మౌనిక, రాధిక, విభ, సాధికా సందీప్, రంజిత్, రెహాన్, సుహాన్, రేవంత్‌లు బంగారు పతకాలు సాధించారు. ఆదివారం స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలోని మున్సిపల్ పార్కులో తాలూకా సీఐ శ్రీరామ్ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు జి.షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

6న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద తెలిపారు. వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో ఉదయం 10 గంటలకు శ్రీకృష్ణ జన్మాష్టమి పూజ, సాయంత్రం 6 గంటలకు చిన్నారులచే నృత్య ప్రదర్శన, శ్రీకృష్ణ, రాధా గోపికల వేషధారణ పోటీలు, ఉట్టికొట్టే కార్యక్రమం, ప్రవచనం ఉంటాయని పేర్కొన్నారు.

సమాజ శ్రేయస్సుకు కంకణ బద్ధులు కండి

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సుకు కంకణ బద్ధులు కావాలని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు పిలుపునిచ్చారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర,బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. మహారాజ భోగ నివేదన చేశారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణతో పాటు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ధాతృత్వ గుణం పెరుగుతుందన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఉషు సంఘం జిల్లా చైర్మన్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లా చీమకుర్తిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 12 బంగారు, 4 వెండి 16 కాంస్య పతకాలు సాధించారు.ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరాటే , ఉషూ వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై విచారణ జరిపించండి

కర్నూలు(అర్బన్): నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల విద్యార్థినుల వసతి గృహం నెంబర్. 2లో చోటు చేసుకుంటున్న ఘటనలకు సంబంధించి వార్డెన్‌పై విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ రాజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మీదేవికి వినతి పత్రం అందించామన్నారు. హాస్టల్ వార్డెన్ వివిధ ఫంక్షన్ల పేరుతో విద్యార్థినుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, వారిలో సీనియర్, జూనియర్ అంటు రెచ్చగొడుతున్నారన్నారు. మెనూ పాటించడం లేదని, వసతి గృహంలోకి అబ్బాయిలు ప్రవేశిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జేడీ మాట్లాడుతూ తనకు అందిన ఫిర్యాదుపై సహాయ సంక్షేమాధికారి చేత విచారణ చేయిస్తున్నామని, తాను కూడా స్వయంగా హాస్టల్‌కు వచ్చి విద్యార్థినులతో మాట్లాడుతానని తెలిపారు.

సముద్రాల హనుమంతరావు మృతికి సంతాపం

కర్నూల కల్చరల్:ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ అన్యాక్రాంతుల ఆస్తుల పరిరక్షణ సమితి చైర్మన్ సముద్రాల హనుమంత రావు ఆకస్మిక మృతి పట్ల పలువరు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతికి బ్రాహ్మణ సేవా మిత్ర మండలి ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, శ్యామ్ సుందర్ రావు, అప్పన్న బ్రాహ్మణ సేవా సంస్థ సమాఖ్య అధ్యక్షులు రాజశేఖర్, దేవిప్రసాద్, పద్మనాభ రావు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

పోషకాహారమే ఔషధం

- విటమిన్ మాత్రల కంటే పోషకాలున్న పదార్థాలు మేలు
- ఆహారంలో కూరగాయలు, తాజాపండ్లు తప్పనిసరి
- జీవనశైలి వ్యాధులకు తృణధాన్యాలు మేలు
- 7వ తేదీ వరకు జాతీయ పోషకాహార వారోత్సవం



కర్నూలు(హాస్పిటల్): పిల్లలు బలహీనమవుతున్నారు. పెద్దకావడానికి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు.దుమ్ము తగిలినా, వర్షం వచ్చినా, చల్లగాలి వీచినా జబ్బుల బారిన పడుతున్నారు. ఫలితంగా తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బిడ్డ కడుపులో పడినప్పటి నుంచి జన్మించి, పెద్దయ్యే వరకు పోషకాహారం తీసుకుంటే ఇలాంటి ఇబ్బందుల నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఈ నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు జాతీయ పోషకాహార వారోత్సాలను పురస్కరించుకుని పోషకాహారంపై ప్రత్యేక కథనం.

పెద్దాసుపత్రిలో రోజుకు 300 నుంచి 350 దాకా ఓపీ

ఒకప్పుడు చంటిబిడ్డలు ఎక్కడ పడితే అక్కడ అడుకున్నా వారికి ఎలాంటి జబ్బులూ వచ్చేవి కావు. ఇప్పుడు పిల్లలకు జలుబు, జ్వరం అంటూ వందల సంఖ్యలో ఆసుపత్రుల వద్ద వేచి ఉంటున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగానికి ప్రతిరోజూ 300 నుంచి 350 దాకా పిల్లలు వివిధ వ్యాధులతో చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలుతో పాటు కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని వైద్యుల వద్దకూ ప్రతిరోజూ 6వేల మంది సగటున చికిత్స పొందుతున్నారు. వీరిలో పుట్టుకతో వచ్చిన వ్యాధులతో కొందరు, జన్మించిన తర్వాత వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండి పలు ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడి మరికొందరు, సీజనల్ వ్యాధులతో ఇంకొందరు ఉంటున్నారు.

పోషకాహారలోప పిల్లల కోసం ఎన్‌ఆర్‌సీ కేంద్రం

పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు చక్కని పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు ఇచ్చినట్లయితే భవిష్యత్‌లో వారి ఆరోగ్యం చాలా బాగుంటుందని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం పోషకాహారంతో బాధపడే పిల్లలకు ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో ఎన్‌ఆర్‌సీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అక్కడ పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదిగే విధంగా పోషకాహారాన్ని అందిస్తున్నారు.అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు, ఐదేళ్లలోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పోషకాహారాన్ని అందిస్తున్నారు.

పిల్లలకు వైవిధ్యమైన ఆహారమివ్వాలి

ఉదయం నుంచి రాత్రి వరకు పిల్లలకు ఒకే విధమైన ఆహారాన్ని ఇవ్వకూడదు. వారికి ఏ పూటకు ఆ పూట వైవిధ్యమైన ఆహారాన్ని ఇస్తూ ఉండాలి. వారు సమయానికి, సరైన మోతాదులో సమతుల ఆహారం తీసుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా కార్బొహైడ్రేట్లు(పిండిపదార్థాలు), ప్రొటీన్లు, కొవ్వులు, మినరల్స్, విటమిన్స్ సమపాళ్లల్లో ఉండేలా చూసుకోవాలి.

ఏ సమయానికి ఏమివ్వాలంటే..

ఉదయం 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్, 11 గంటలకు స్నాక్స్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి డిన్నర్ ఇలా విభజించి పిల్లలకు ఆహారాన్ని తినిపించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వడం మానకూడదు. రోజువారీ ఆహారంలో అన్నం తప్పనిసరిగా ఉండాలి. చపాతి, పప్పు, కూరగాయలు, పండ్లు, పాలు, హోల్‌గ్రెయిన్స్, తృణధాన్యాలు, పెసర్లు, శనగలు, మాంసాహారులైతే కోడిగుడ్డు ఇవ్వాలి. ప్రధానంగా బొప్పాయి, మామిడి, అరటి, బీట్‌రూట్, బెండ, సొరకాయ, బీన్స్, క్యారెట్, ఆకుకూరలను పిల్లలకు ఇవ్వాలి. వీటిని ఒక్కోపూట మార్చుకుంటూ వండి పిల్లలకు తినిపించాలి.

టిఫిన్‌లో తీసుకోదగిన ఆహారం

కార్న్‌ఫ్లెక్స్‌తో కూడిన పాలు, ఇడ్లీ, దోశ, ఊతప్పం, గోధుమ రవ్వ ఉప్మా, కూరగాయల ఉప్మా, ఓట్స్ ఉప్మా, బ్రెడ్ ఆమ్లెట్, పొంగల్, అటుకుల ఉప్మా, స్టఫ్డ్ రోటీ, పాలతో కూడిన రోటి వంటివి తీసుకోవచ్చు.

భోజనంలో తీసుకోదగిన ఆహారం

లైమ్ రైస్, టొమోటా రైస్, కరివేపాకు, పాలకూర రైస్, జీరా రైస్, ఉడకబెట్టిన కోడిగుడ్లు, మేతిరోటీ, ఆలూ పరోటా, క్యారెట్ రోటి, ఖిచిడి, పొంగల్, అన్నంతో కూడిన రైతా, పెరుగుతో కూడిన అన్నం (ఇందులో ద్రాక్ష, యాపిల్, దానిమ్మ ముక్కలు కలపాలి) వంటివి తీసుకోవచ్చు.

చిరుతిండి(స్నాక్స్)లో తీసుకోదగిన ఆహారం

మిల్క్‌షేక్, ఉడకబెట్టిన కోడిగుడ్లు, తాజాగా తయారు చేసిన సూపులు, పండ్ల రసాలు, రాగి జావ, పాలు, ఉడికించిన శనగలు, మొలకెత్తిన విత్తనాలు, అటుకుల ఉప్మా, మరమరాల లడ్డు, చిక్కీలు (వేరుశనగలడ్డు), కూరగాయల సలాడ్, ఫ్రూట్ సలాడ్, పాయసం, శ్రీకండ్ స్వీట్స్ వంటివి తీసుకోవచ్చు.

ఆహారమే పరమ ఔషధం



సరైన ఆహారాన్ని పిల్లలకు ఇవ్వకపోతే వారికి రక్తహీనత, పోషకాహారలోపం , రేచీకటి వంటి సమస్యలు వస్తాయి. వారు పెద్దయ్యాక అధిక బరువు, దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, కిడ్నీ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుంది. పిల్లలకు రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు ఇవ్వడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది, దీనివల్ల పోషకాహార లోపాన్ని నివారించవచ్చు. అధికంగా ప్రొటీన్లు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల పిల్లలు సరైన బరువు, పెద్దలు వయస్సుకు తగ్గట్లుగా శక్తి కలిగి ఉంటారు.

– డాక్టర్ జి. రమాదేవి, డైటీషియన్, కర్నూలు

బిడ్డకు తల్లిపాలే అమృతం



సాధారణంగా ఏడు నెలల్లో బిడ్డ జన్మిస్తే ఆ తల్లికి వచ్చే పాలలో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. అదే 9 నెలలు నిండాక జన్మిస్తే తల్లిపాలలో ప్రొటీన్లు కాస్త తక్కువగా ఉంటాయి. బిడ్డ అవసరాన్ని బట్టి ప్రకృతి అలా తీర్చిదిద్దుతుంది. బిడ్డకు తల్లిపాలే అమృతం. ఇందుకోసం ఆమె గర్భంతో ఉన్నప్పుడే మంచి పోషకాలున్న ఆహారం తీసుకోవాలి. దీనివల్ల ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తాడు. బాలింతగా ఉన్నప్పుడూ మంచి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి. బాలింతకు ఎలాంటి పత్యమూ పెట్టకూడదు. తల్లిపాలు ఉండగా బిడ్డకు పోతపాలు అస్సలు ఇవ్వకూడదు. దీనివల్ల బిడ్డ అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది.

– డాక్టర్ కె. సింధూర, చిన్నపిల్లల వైద్యురాలు, కర్నూలు

ఎమ్మెల్యేను కలసిన ఉర్దూ వర్సిటీ పాలకమండలి సభ్యులు



పాలకమండలి సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్) : ఉర్దూ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులుగా ఎంపికైన పారిశ్రామిక వేత్త నవీద్ పర్వేజ్, న్యాయవాది జీఎండీ ఇబ్రహీం ఆదివారం కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను కలిశారు. ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలసి శాలువతో సన్మానించారు. ప్రతిగా ఎమ్మెల్యే కూడా వారిని శాలువ కప్పి సన్మానించి ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మొయిన్‌ఖాన్, కార్పొరేటర్లు జుబైర్ అహ్మద్, షాషావలి,శనవాజ్‌ఖాన్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

తూనిక యంత్రాలకు సీళ్లు వేయించుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ పీవీఎం. పరమేశ్వర కుమార్

కర్నూలు (న్యూసిటీ): వ్యాపారులు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలకు సకాలంలో సీళ్లు వేయించుకోవాలని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం .పరమేశ్వర కుమార్ తెలిపారు. ఆదివారం కల్లూరులోని షాపులను తనిఖీ చేసి యంత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 100 ఎలక్ట్రానిక్ యంత్రాలకు సీళ్లు వేశామన్నారు. వ్యాపారులు ఎలక్ట్రానిక్ యంత్రాలకు సంవత్సరానికి ఒక సారి సీళ్లు వేయించుకోవాలని సూచించారు. పాత యంత్రాలను వాడితే తూకాల్లో తేడా వస్తుందని, సీళ్లు లేకుండా యంత్రాలను ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు వ్యాపారులు మోసం చేయడానికి అరిగిపోయిన కాటా రాళ్లు ఉపయోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని మార్చుకోవాలని సూచించారు.

సాహిత్య పురస్కార గ్రహీతలకు సన్మానం



సాహిత్య పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: రాష్ట్ర స్థాయి హంస, గిడుగు సాహిత్య పురస్కార గ్రహీతలను ఆదివారం ఘనంగా సన్మానించారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన కార్యక్రమంలో హంస పురస్కార గ్రహీత ఎస్.డి.వి. అజీజ్, గిడుగు సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ ఎం. హరికిషన్‌లకు పలువురు సాహితీ వేత్తలు సన్మానించారు. ఈ సందర్భంగా గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ రచనలు సామాజిక ప్రయోజనాలివ్వాలన్నారు. ప్రాచీన ఆధునిక సాహిత్య, చరిత్ర నిర్మాణం, సాహిత్యంలో కర్నూలుకు విశిష్ట స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు వెంకట కృష్ణ, మారుతి, కెంగార మోహన్, జేఎస్ ఆర్కేశర్మ, ఇనాయతుల్లా, చౌశా, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమానికి కృషి



రాష్ట్ర మహా సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: టైలర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర టైలర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభాన్‌బీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో కర్నూలు జిల్లా టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ అర్హులైన టైలర్లకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడం ముఖ్యమంత్రి గొప్పతనమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్కీ నాగేశ్వరరావు మాట్లాడుతూ టైలర్ల రాష్ట్ర మహాసభను ఈనెల 17వ తేదీన ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహాసభకు కార్యవర్గ సభ్యులతో పాటు టైలర్లు అందరూ హాజరు కావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఖలీల్ బాష అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, వేణుగోపాల్, సుభాన్, జిల్లా కార్యదర్శి సైపుల్లా, కోశాధికారి ఖాసీం పాల్గొన్నారు.

తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరాలను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్) : తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన వెంకటేష్, రోహిత్, నాగరాజు కుకువన్ బ్లాక్‌బెల్ట్ సాధించారు. డాన్–1, డాన్–2 సాధించిన క్రీడాకారులకు ఆదివారం సాయంత్రం స్థానిక వెంకటచలపతి కల్యాణ మండపంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలులో తైక్వాండో క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. చిన్ననాటి నుండే చిన్నారుల్లో ఈ క్రీడ పట్ల ఆసక్తి పెంచేందుకు ఉచితంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు.

మంచి సాహిత్యంతో ఆరోగ్యం పదిలం



డాక్టర్ జాగర్లపూడి శ్యామసుందరశాస్త్రిని సన్మానిస్తున్న ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): మంచి సాహిత్యం చదవడం వల్ల మానసిక ఆరోగ్యం వృద్ధి చెంది ఆరోగ్యం పదిలమవుతుందని అనంతపురం ఆలిండియా రేడియో సీనియర్ అనౌన్సర్ డాక్టర్ జాగర్లమూడి శ్యామసుందరశాస్త్రి అన్నారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో 'సాహిత్యం–హృదయం' అనే అంశంపై ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి ఒక్కరికీ పుస్తకాలు చదివే అలవాటు ఉండేదని, అందులో మంచి సాహిత్యం గల పుస్తకాలపై ఆసక్తి చూపించేవారన్నారు. పుస్తకాలు చదవడం వల్ల భాషా ప్రావీణ్యంతో పాటు మంచి జ్ఞానం కూడా వృద్ధి చెందుతుందని అన్నారు. మంచి సాహిత్యం చదవడం వల్ల మనసుకు ఎంతో ఆహ్లాదంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మంచి పుస్తకాలను నిత్యం చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ, ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

మహిళా ఏఎస్‌ఐ ఆత్మహత్యాయత్నం

కర్నూలు (టౌన్): నగరంలోని లక్ష్మీనగర్‌లో నివసించే మహిళా ఏఎస్‌ఐ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య మనస్పర్థలు రావడంతో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం నిద్ర మాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు అమె కోలుకున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఈ సంఘటన జరిగింది. ఎలాంటి ఫిర్యాదు రాలేదని మూడవ పట్టణ పోలీసులు వెల్లడించారు.

ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు తక్షణమే నోటిఫికేషన్లను విడుదల చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న విజేత స్టడీ సర్కిల్‌లో నిరుద్యోగ సమస్య–కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, నగేష్, రాఘవేంద్ర, హుస్సేన్‌బాష, అబ్దుల్లా, సాయి, ఉదయ్, అమర్ పాల్గొన్నారు.

విత్తన ఎంపికపై అవగాహన పెంచుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో విత్తనం ఎంపికనే అత్యంత కీలకమైనదని, మంచి విత్తనానికి ఉండవలసిన లక్షణాలపై అవగాహన పెంచుకోవాలని నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం విశ్రాంత సీడ్ టెక్నాలజీ అధికారి రామరాజు ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమో కోర్సులో భాగంగా ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... నాణ్యమైన విత్తనానికి ఉండవలసిన లక్షణాలు, విత్తన రకాలు, రైతులు విత్తనాలు ఎంపిక చేసుకునే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు మన ప్రాంతానికి అనువైన, ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు.

కర్నూలు పోలీసు స్టేషన్‌కు చిత్తూరు జిల్లా టీడీపీ నేతలు

కర్నూలు (టౌన్): చిత్తూరు జిల్లాకు చెందిన తెలుగు దేశం పార్టీ నేతలు ఆదివారం కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో హాజరయ్యారు. గత నెలలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా అంగళ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా పోలీసులకు, టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. రెచ్చిపోయిన టీడీపీ నాయకులు పోలీసులపై దౌర్జన్యం చేయడంతో పాటు తీవ్రంగా గాయపరిచారు. రాళ్లు కర్రలతో పోలీసులపై దాడులు చేయడంతో ఒక పోలీసు కంటిచూపు కోల్పోయాడు. దీంతో స్పందించిన ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఘటనలో తెలుగుదేశం పార్టీ పీలేరు ఇన్‌చార్జ్ నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పులపర్తి నానిలు నిందితులుగా ఉన్నారు. వీరు ఇప్పటికే కోర్టును ఆశ్రయించారు. వీరికి కండిషన్ బెయిల్ ఇస్తూ ఏదో ఒక పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ఆదివారం వీరిద్దరూ కర్నూలు మూడోపట్టణ పోలీసు స్టేషన్‌లో హాజరయ్యారు.



పూజలందుకున్న ఈరన్న స్వామి



తుంగభద్ర దిగువ కాలువలో స్నానాలు చేస్తున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన ఉరుకుంద క్షేత్రం



సీతారామిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచే దర్శన క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. క్షేత్రంలో ఎక్కడచూసినా భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రావణమాస ఉత్సవాల్లో మూడవ సోమవారానికి ప్రత్యేకత ఉంది. ఆ రోజున సుమారు 3 లక్షల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. దేవాలయ అధికారులు ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వివిపీ దర్శనం క్యూలైన్ల ద్వారా స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి నైవేద్యం సమర్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారాయమ్మ, కోసిగి సీఐ ఏరిషావలి, మరో ఇద్దరు సీఐలు ఆధ్వర్యంలో కౌతాళం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఆరుగురు ఎస్‌ఐలు, పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులతో గట్టి పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్నారు.

ఈరన్నస్వామిని దర్శించుకున్న వై.సీతారామిరెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి ఆదివారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. శ్రావణమాసంలో స్వామివారిని దర్శించుకోవడం అనవాయితీగా వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆయనకు అర్చకులు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. శ్రావణమాసం మూడో సోమవారం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. అలాగే కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆదివారం కుటుంబ సమేతంగా తరలివచ్చి ఈరన్న స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ పర్యవేక్షకులు రామ్మోహన్, మల్లికార్జున, వేంకటేష్, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లైబ్రేరియన్

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. చిత్రాలు గీయడం, కథలు చదవడం, చెప్పడం, తదితర విషయాలపై మెలకువలు నేర్పించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి ప్రకాష్ సూచన మేరకు గ్రంథలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు (న్యూసిటీ): నగరంలోని ఒకటో వార్డు రాయల్ ఫంక్షన్ హాలు సమీపంలో ఉన్న హజ్రత్ సయ్యద్ షా అఖర్ షా మౌలా అక్బర్ షా తూలహా దర్గాలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం దర్గాలో సందల్ ఉత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భక్తులు పెద్దఎత్తున దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మతపెద్దలు మౌలానా యాసీన్ అలీ, మౌలానా రాఫెయి జిలానీ, సయ్యద్ మూబషీర్ పాషా ఖాద్రి, సజ్జద్ నసీన్ తదితరులు పాల్గొన్నారు.